
లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద భారీగా చేరిన వరద నీరు


మియాపూర్ బొల్లారం రోడ్డులో ..
మ్యాన్‌హోల్ వ్యర్థాలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది


టెలికామ్‌నగర్‌లోని వీకర్ సెక్షన్ కాలనీలో..

ఎడతెరిపి లేని వర్షం..

లోతట్టు ప్రాంతాలు జలమయం

- లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద భారీగా నిలిచిన నీరు
- పలుచోట్ల రోడ్లపై వరదనీటితో ఇక్కట్లు
- రంగంలోకి దిగిన పోలీసులు, జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది

భారీ వర్షాల నేపథ్యంలో.. కంట్రోల్‌రూం నంబర్లు

జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ గ్రీవియన్స్ నంబర్: 040-21111111

- ఎమ్మెల్యే గాంధీ కార్యాలయం : 9154525252, 9177762946, 9121448999
- జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూమ్ నంబర్ 9704601866
- జీహెచ్‌ఎంసీ ట్రీ కటింగ్ నంబర్: 6309062583
- వాటర్ లాగింగ్ నంబర్ : 9000113667


మాదాపూర్ నెక్టార్‌గార్డెన్ వద్ద ..

శేరిలింగంపల్లి జోన్‌బృందం: ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ప్రజలు ఇబ్బందిపడ్డారు. శనివారం నుంచి వర్షం కురుస్తుండడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, చందానగర్, శేరిలింగంపల్లి సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు పరిస్థితిని పర్యవేక్షించారు. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరదనీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు.

- మియాపూర్ ఎఫ్‌సీఐ కాలనీలో గాలి వానకు చెట్టు కూలిపోయింది. డీఆర్‌ఎఫ్ సిబ్బంది తొలగింపచేయడంతో రాకపోకలు తిరిగిసాగాయి
- మియాపూర్‌లోని ఎంఏనగర్–శాంతినగర్ రోడ్డుపై వరద పారుతోంది.
- మాదాపూర్, దుర్గం చెరువు పరిసరాల్లో, నెక్టార్ గార్డెన్‌తో పాటు పలు కాలనీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది.
- నల్లగండ్ల సిటిజన్ ఆస్పత్రి ముందున్న ప్రధానరోడ్డుపై ఒకవైపు రోడ్డులో భారీగా వరదనీరు నిలిచిపోయింది.
- పలుచోట్ల రోడ్లపై గుంతలలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.
- నెక్టార్ గార్డెన్ జంక్షన్ వద్ద భారీగా వరదనీరు రావడంతో ఆ ప్రాంతవాసులు ఇక్కట్లు పడ్డారు.
- మియాపూర్‌- బొల్లారం రోడ్డులో మ్యాన్ హోల్‌లో చెత్తాచెదారాన్ని తొలగించి వరదనీరు సాఫీగా వెళ్లేలా చూశారు.
- టెలికామ్‌నగర్‌లోని వీకర్‌సెక్షన్‌లో నాలాలో ప్రహరీగోడ రాళ్ళు పడిపోవడంతో నీరు బస్తీలోకి వచ్చే ప్రమాదం ఉండడంతో స్థానికుల ఫిర్యాదుపై డీఆర్‌ఎఫ్ సిబ్బంది వెంటనే అక్కడి చేరుకొని తొలగించారు.


శేరిలింగంపల్లిలో..


దూబే కాలనీలో ..



మియాపూర్‌లోని ఎఫ్‌సీఐ కాలనీలో గాలివానకు విరిగిపడిన చెట్టు, తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది


నిర్మానుష్యంగా గచ్చిబౌలి ప్రధాన రోడ్డు


మియాపూర్ ఎంఏ నగర్ – శాంతినగర్ రోడ్డు జలమయం

విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం

చందానగర్ : అస్నా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆదివారం చెట్లు పడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చందానగర్, హఫీజ్‌పేట్, తారానగర్, వేమన కాలనీ సెక్షన్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీలలో చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మాతృశ్రీనగర్, శిల్పా ఎన్‌క్లేవ్‌లో సుమారు 4 గంటల పాటు విద్యుత్ ఏఈలు, సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

బస్తీల్లో కార్పొరేటర్ పర్యటన


చందానగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

చందానగర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చందానగర్ డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీ, జవహర్ నగర్, కైలాష్‌నగర్, ఫ్రెండ్స్ కాలనీ, దీప్తిశ్రీనగర్ కాలనీలలో ఆదివారం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో రెండు రోజులు భారీ వర్షాలు పడతాయని ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకు రావద్దన్నారు. ఏదేని అత్యవసరం అయితే తమ కార్యాలయం 9885356677 నంబర్లో సంప్రదించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఏఈ సంతోష్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తదితరులు ఉన్నారు.

దృశ్యాదృశ్య జ్ఞాన సంగమమే మానవ జీవితం

రాయదుర్గం: కంటికి కనిపించేది మాత్రమే సత్యమనీ, మనకి కనిపించనంత మాత్రాన నిజం లేదనుకోవడానికి లేదని హెచ్‌సీయూ తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అమెరికాలోని సిరోకన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వాసిలి రచించిన ఏడో రుతువును ఎంతో తాత్వికంగా చెప్పారని అన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దర్భ శయనం, చంద్రోఖర్ రచించిన చిగురించిన శిలాజం కవితా సంపుటి ఆవిష్కరణ, డాక్టర్ వాసిలి వసంతకుమార్ రచించిన ఏడో రుతువు కావ్య పరిచయాలను చేశారు. కార్యక్రమంలో పలువురు తెలుగు రచయితలు, ఫ్యాకల్టీ ప్రతినిధులులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 25, పచ్చిమిర్చి 40, బెండ 40, కాకర 40, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 30, గోకర 40, బీన్స్ 100, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 80, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 300.

క్లారిటీ బెనిఫిట్ సొల్యూషన్స్ ప్రారంభం



మాదాపూర్: అమెరికాలో ఉద్యోగులకు ప్రయోజనాలు అందించే క్లారిటీ బెనిఫిట్ సొల్యూషన్స్ మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలో తమ శాఖను ఆదివారం ప్రారంభించింది. దీనికి సంబంధించి మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొల్యూషన్స్ ఫౌండర్ బిల్ కాటుజీ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా వేలాది చిన్న, మధ్య తరహా వ్యాపారులకు వినూత్న పరిష్కారాలు అందించడంలో ముందంజలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మాధురి, రీమా భక్షి, శ్రీనివాస్, అపర్ణ, లక్ష్మి, రాంభీ రామవరం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి



మాదాపూర్: మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవావత్ సురేష్ నాయక్ భౌతికకాయానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధి కుసుమకుమార్, పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్‌లు నివాళులర్పించారు. సురేష్ సేవలు మరువలేనివని తెలిపారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.

జై గణేష్ భక్తి సమితి ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్

పటాన్‌చెరు టౌన్: జై గణేష్ భక్తి సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌గుప్తాను నియమించినట్లు సమితి రాష్ట్ర వైస్ చైర్మన్ నవీన్ ముదిరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు మట్టి వినాయకుని ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా చూస్తానని తెలిపారు. మట్టి వినాయకుని పూజిద్దాం..పర్యావరణాన్ని పరిరక్షిస్తాం అనే నినాదంతో ముందుకు సాగుతామని తెలిపారు.

7న స్త్రీల సదస్సు

ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట, ఆర్‌పి కాలనీలోని బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్త్రీల సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో షారోను రూపాంతర దేవాలయ వ్యవస్థాపకులు ఎస్ సుధారాణి ప్రసంగిస్తారు. కార్యక్రమం అనంతరం భోజన వసతి ఉంటుందని శోభారాణి తెలిపారు.

అంబీర్ చెరువు పరిశీలన

ఆల్విన్‌కాలనీ: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అంబీర్ చెరువు పూర్తిగా నిండిందని, ఔట్ లెట్ పరిస్థితి, చెరువు కట్ట సామర్థ్యాన్ని పరిశీలించామన్నారు. అధికారులు లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి


శేరిలింగంపల్లిలో పర్యటించిన జెడ్సీ ఉపేందర్‌రెడ్డి, అధికారులు

గచ్చిబౌలి: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని లింగంపల్లి ఆర్‌యూబీ, మైహోమ్ మంగళ ఆర్‌యూబీ, నెక్టార్ గార్డెన్, గచ్చిబౌలి, ఖాజాగూడ ప్రాంతాలలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో 15 మాన్‌సూన్ బృందాలు సహాయక చర్యలలో పాల్గొంటున్నాయన్నారు. నాలాలు, డ్రైన్ల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు., జెడ్సీ వెంట డీసీలు ముకుందరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎస్‌ఈ శంకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

33 కేవీ విద్యుత్ లైన్‌పై పడ్డ కర్రలు..ఆగిన సరఫరా


నిర్మాణంలో ఉన్న భవనం పై అంతస్తు వద్ద 33 కేవీ లైన్‌పై పడ్డ కర్రలు

శేరిలింగంపల్లి: ఓ భవన నిర్మాణం కనపడకుండా అడ్డుగా ఏర్పాటు చేసిన కర్రలు 33 కేవీ విద్యుత్ లైన్‌పై పడటంతో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఓవైపు కుండపోత వర్షానికి కర్రలు నానిపోయి విరిగి విద్యుత్ లైన్‌పై పడడంతో పెద్ద శబ్దం వచ్చింది. గంట పాటు సరఫరా నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే... గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో సిటిజన్ హాస్పిటల్ ఎదురుగా ప్రధాన రోడ్డుపైన వంద గజాల లోపు స్థలంలో గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్తుల నిర్మాణం జరుగుతోంది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే సదరు విభాగం అధికారులు వాటిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గణేశ్ ఉత్సవాలకు సిద్ధం



మియాపూర్: వినాయక చవితి సందడి మొదలైంది. కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లలో గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అసోసియేషన్ పెద్దలు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మండపాల ఏర్పాట్లలో ఉన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మియాపూర్ పోలీసులు కాలనీలు, బస్తీలలో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీలో వినాయక విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. రూ.400 నుంచి 45వేల రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. కొన్నిచోట్ల విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. కాగా పర్యావరణానికి హాని కలగకుండా మట్టి విగ్రహాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.




శివయ్యకు పుష్పార్చన



మియాపూర్: మాసశివ రాత్రి సందర్భంగా మియాపూర్ మయూరినగర్ కాలనీలోని శివాలయంలో కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల కాలనీల నుండి భక్తులు వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇంచార్జి ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, తెలుగు, కామర్స్, ఫిజిక్స్, సబ్జెక్ట్‌ల్లో బోధనకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని అదే రోజు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ 55% ఎస్‌ఇటీ/ఎస్‌ఇటీ/పీజీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, మధ్యాహ్నం 12 గంటల నుండి కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలన్నారు.

సరుకులు పంపిణీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి రామకృష్ణ హైస్కూలు పూర్వ విద్యార్థులు, చిన్ననాటి మిత్రుడు ఏకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నవ్యశ్రీ ఫౌండేషన్ అనాథ శరణాలయంలో సరుకులు అందజేశారు.

ఇదా ప్రోత్సాహం..?

టీజీఎల్ఐపీకి నిధులు..నియామకాలు లేవు

- ఉన్న భూములు ఇతర సంస్థలకు కేటాయింపు
- ఉనికి కోల్పోతున్న ప్రభుత్వరంగ సంస్థ


రాయదుర్గంలో లిడ్‌క్యాప్ సంస్థ భవనం

రాయదుర్గం: ప్రభుత్వరంగ సంస్థ దాదాపుగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంటోంది. చర్మకారుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన లిడ్‌క్యాప్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ చర్మ పరిశ్రమాభివృద్ధి సంస్థ (లిడ్‌క్యాప్), తర్వాత తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రియల్ ప్రమోషనల్ కార్పొరేషన్ (లిప్కో), నేడు తెలంగాణ రాష్ట్ర లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఎస్ఎల్ఐపీసీఎల్) ఉనికి కోల్పోయే స్థితికి చేరుకుంది. ప్రభుత్వాల శీతకన్నుతో ఈ సంస్థ ఉనికి కోల్పోతుందని చర్మకారులు వాపోతున్నారు. నిధులు కేటాయించక, నియామకాలు పూర్తిగా నిలిపివేయడం.. ఆ తర్వాత ప్రభుత్వం ఇతర అవసరాలకు ఈ స్థలం కేటాయిస్తూ పోవడంతో నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొంది.1973–74లో రాయదుర్గంలోని 42 ఎకరాలలో చెప్పులు, షూ, ఇతర చర్మ ఉత్పత్తుల తయారీ కర్మాగారంను ఏర్పాటు చేశారు. సంస్థ ప్రాంగణంలోనే 1986లో నాయుడమ్మ అంతర్జాతీయ చర్మ ఉత్పత్తులు, ఎగుమతుల ప్రాంగణం, కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించారు. క్రమేణా పట్టింపు లేమితో నిర్వీర్యమైంది.

ఇతర సంస్థలకు 28.16 ఎకరాల కేటాయింపు..

నగర శివారు ఐటీ కారిడార్ చెంతనే పాత ముంబై జాతీయ రహదారికి, లింకురోడ్డు పక్కనే 42 ఎకరాల విశాలమైన స్థలం ఉండేది. ఇతర అవసరాలకు కేటాయిస్తూ పోవడంతో ప్రస్తుతం సగం కంటే తక్కువ మిగిలింది. 1980లో గవర్నమెంట్ లెదర్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ కోసం 5 ఎకరాల స్థలం కేటాయించారు. ఆ తర్వాత ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) ఏర్పాటు కోసం మరో 15 ఎకరాల స్థలం కేటాయించారు. ఆరేళ్ల క్రితం పాత ముంబై జాతీయ రహదారి –జూబ్లీ హిల్స్ వరకు లింకురోడ్డు ఏర్పాటుకు సుమారు 3 ఎకరాల స్థలం పోయింది. తాజాగా 5 ఎకరాల 16గుంటల స్థలాన్ని కేంద్రం సూచనపై రాష్ట్ర ప్రభుత్వం యూనిటీమాల్ ఏర్పాటుకు కేటాయించారు. దీంతో 28 ఎకరాల 16 గుంటల స్థలాన్ని ఇతర సంస్థలకు కేటాయించడంతో ప్రస్తుతం భవనా లున్న స్థలం మాత్రమే ఈ సంస్థకు మిగిలింది. కేటాయించిన స్థలం పక్కనే హైదరాబాద్ నాలెడ్జి సిటీలో టీఎస్ఐఐసీ సంస్థ ఎకరాకు రూ.50 కోట్ల వరకు ఆన్‌లైన్ వేలంలో ధర పలకడంతో ప్రస్తుతం కేటాయించిన భూముల విలువను లెక్కకడితే సుమారు రూ.1,400 కోట్ల వరకు వచ్చేవని అంచనా.

పాలకమండలి ఏర్పాటు కలగానే..

లిడ్‌క్యాప్ సంస్థకు పాలకమండలి ఏర్పాటు చేయడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చిత్తూరు జిల్లాకు చెందిన రెడ్డెప్పను ఈ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం చేశారు. తదనంతరం అప్పటి నుంచి ఇప్పటి వరకు పాలకమండలి ఏర్పాటు చేయలేదు. తదనంతర పరిణామాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ఈ సంస్థను ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక భవిష్యత్తులోనూ నియామకాలు ఉండే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో సంస్థ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

గతంలో 600 మంది.. నేడు 23మందితో..

లిడ్‌క్యాప్ సంస్థ ప్రారంభంలో 600 మంది దాకా అధికారులు, ఉద్యోగులు పనిచేసేవారు. వారు రిటైర్ అవుతున్నా నియామకాలు లేవు. ప్రస్తుతం రాష్ట్రం విడిపోయాక 42 మందిని తెలంగాణకు కేటాయించగా రిటైరైన వారిని మినహాయిస్తే కేవలం 23 మందితో సంస్థను కొనసాగించేవారు. ఇక ఈ సంస్థ మూసివేయడం తథ్యమని చర్మకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లిడ్‌క్యాప్ స్థలం సూచించే మ్యాప్